క్లుప్తంగా

ఇంటర్మీడియట్ అడ్మిషన్‌లు ప్రారంభం

ధన్వాడ: ధన్వాడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 2025–06 విద్యా సంవత్సరానికి గాను అడ్మిషన్లు ప్రారంభమైనట్లు ప్రిన్సిపల్ అబ్దుల్ ముజీబ్ తెలిపారు. ఎంపీసీ, బైపీసీ తెలుగు, ఇంగ్లిష్ మీడియంలో సీఈసీ, హెచ్ఈసీ, యంఈసీ కోర్సులు ఉన్నాయని ఈ సువర్ణ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వివరాలకు కళాశాలను లేదా 94942 66258, 82470 28307 నంబర్లను సంప్రదించాలని కోరారు.

కార్యకర్త కుటుంబానికి పరామర్శ



ధన్వాడ: కంసాన్‌పల్లి గ్రామానికి చెందిన బీజేపీ కార్యకర్త ఉప్పరి నారాయణ ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. విషయం తెలుసుకున్న బీజేపీ రాష్ట్ర నాయకుడు నాగురావ్ నామోజీ గురువారం నారాయణ కుటుంబాన్ని పరామర్శించారు. బాధిత కుటుంబాన్ని ఓదార్చి పార్టీ తరఫున ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ఆయన వెంట పార్టీ మండల అధ్యక్షుడు శివరాజ్, మాజీ ఎంపీటీసీ ఉమేష్‌కుమార్, నాయకులు నారాయణ, రాజుసాగర్, శంకర్ ఉన్నారు.

కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేద్దాం

ఊట్కూర్: కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేద్దామని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. గురువారం ఊట్కూర్ గ్రామ శివారులోని శ్రీ మూకి బసవన్న దేవాలయంలో జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్ కుమార్ రెడ్డి అధ్యక్షతన మండల కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందన్నారు. త్వరలో గ్రామ, మండల కమిటీలను ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ అబ్జర్వర్స్ వేణు గౌడ్, సంధ్యారెడ్డి, నాయకులు నారాయణరెడ్డి, మణెమ్మ, సూర్యప్రకాశ్‌రెడ్డి, యజ్ఞేశ్వర్‌రెడ్డి, కోరం మహేశ్‌రెడ్డి, వెంకటేశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

మరికల్: మండలంలోని రాకొండ గ్రామంలో ఓ ఇంట్లో నిల్వ ఉంచిన సన్నరకం రేషన్ బియ్యాన్ని గురువారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. గ్రామానికి చెందిన ఎరుకలి మొగిలి అనే వ్యక్తి గ్రామంలో తక్కువ ధరకు రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి ఇంట్లో నిల్వ ఉంచుకున్నాడు. విషయం టాస్క్‌ఫోర్స్, మరికల్ పోలీసులకు తెలియడంతో దాడి చేసి 9.5 క్వింటాళ్ల బియ్యం స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడ్డ బియ్యాన్ని మరికల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. డీటీ నాగరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాము తెలిపారు.

నకిలీ విత్తనాలతో రైతులు అప్రమత్తంగా ఉండాలి

కృష్ణా: మండలంలోని పలు గ్రామాలు కర్ణాటక సరిహద్దులో ఉండడం వల్ల అటు వైపు ఉన్న కర్ణాటకకు చెందిన వ్యాపారులు నకిలీ పత్తి విత్తనాలను తెచ్చి తక్కువ ధరకు విక్రయిస్తుంటారని అలాంటి వారితో రైతులు అప్రమత్తంగా ఉండాలని కృష్ణా ఎస్ఐ నవీద్ సూచించారు. గురువారం ఆయన మాట్లాడుతూ పత్తి విత్తనాలను ప్రభుత్వం సూచించిన దుకాణాల్లోనే కొనుగోలు చేయాలని, అలాగే కొన్న వాటికి రశీదు కూడ తీసుకోవాలని కోరారు. గ్రామాల్లో నకిలీ విత్తనాలను ఎవరైనా విక్రయిస్తే తమ దృష్టికి తీసుకురావాలన్నారు.

అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణకు తరలిరండి



నారాయణపేట: మక్తల్ మండలం పస్పుల గ్రామంలో ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహాన్ని ఈనెల 24న ఆవిష్కరించనున్నట్లు జేవీవీపీఎస్ జిల్లా కన్వీనర్ హాజమ్మ, సీఐటీయూ జిల్లా నాయకులు బాల్‌రాం తెలిపారు. ఈ మేరకు విగ్రహ ఆవిష్కరణకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం దగ్గర గురువారం విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి జిల్లాలోని అంబేద్కర్ సంఘాల నాయకులు, కార్యకర్తలు, బహుజనులు భారీ ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా నాయకులు గౌతమ్, దళిత ప్రజాసంఘాల నాయకులు కృష్ణ, నర్సింహులు, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

సిద్ధమవుతున్న యూనిఫాంలు



యూనిఫాంలు కుడుతున్న మహిళలు

- మండలంలో 5451 మంది విద్యార్థులు
- మహిళా స్వశక్తి సంఘాలతో యూనిఫాంల తయారీ



కుట్టిన యూనిఫాం

దామరగిద్ద: ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు పంపిణీ చేయనున్న యూనిఫాం తయారీలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం మహిళా స్వశక్తి సభ్యులకు ఉపాధి కల్పించేలా చర్యలు చేపట్టింది. స్వయం సహాయక సభ్యులకు ఉపాధి కల్పించడంతో పాటు విద్యార్థులకు త్వరితగతిన యూనిఫాంలు అందించేలా ప్రణాళికలు చేపట్టింది. గతంలో టెండర్‌ల ద్వారా కాంట్రాక్ట్ పద్ధతిన యూనిఫాంలు కుట్టించేవారు. అయితే ప్రస్తుతం ఆ పద్ధతికి స్వస్తి పలుకుతూ గత ఏడాది నుంచి డీఆర్‌డీఏ ద్వారా మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో మహిళా సంఘాల సభ్యుల చేత యూనిఫాంలను కుట్టిస్తూ వారికి ఉపాధి కల్పించింది.

4754 యూనిఫాంల సిద్ధం

మండలంలోని 45 ప్రభుత్వ పాఠశాలల్లో 1 నుంచి 10 తరగత వరకు 5451 మంది విద్యారులు చదువుకుంటున్నారు. వీరికి మొదటి దఫా యూనిఫాం అందించేందుకు మహిళా సంఘాల సభ్యులు సిద్ధం చేస్తున్నారు. ఇప్పటి వరకు 4754 యూనిఫాంలు సిద్ధం కాగా మరో రెండు రోజుల్లో వంద శాతం పూర్తి చేయనున్నట్లు అధికారులు తెలిపారు. మండలంలో టైలరింగ్ చేసే మహిళ సంఘాల సభ్యులను గుర్తించి వారికి బట్టను అందజేశారు. గతేడాది 80 మహిళ సంఘాల్లో 113 మంది మహిళలు యూనిఫాం కుట్టేందుకు ముందుకు రాగా వారికి బట్టను అందజేసి ఏకరూప దుస్తులను కుట్టించారు. కుట్టు కూలిగా ఒక్కో జతకు రూ. 75 చెల్లించారు. ఈ ఏడాది సైతం అదే పద్ధతిలో యూనిఫాంలు సిద్ధం చేస్తున్నారు. ప్రభుత్వం మహిళా సంఘాలకు ఉపాధి కల్పించే దిశగా టైలరింగ్ నేర్చుకున్నా వారికి యూనిపాం తయారీ బాధ్యతలు అప్పగించడంతో మహిళా సంఘాల సభ్యులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

మరిన్ని ఉపాధి అవకాశాలు కల్పించాలి



ప్రభుత్వం మహిళ సంఘాల్లో టైలరింగ్ నైపుణ్యం గల సభ్యులను గుర్తించి యూనిఫాం తయారీని మహిళ సంఘాల సభ్యులకు అందించడంతో ఉపాధి లభిస్తుంది. ప్రభుత్వం మహిళలకు మరిన్ని ఉపాధి అవకాశాలను కల్పించాలి. ఉపాధికి రుణాలు ఇవ్వడంతో పాటు మహిళ సంఘాల సభ్యుల్లో నైపుణ్యాలను గుర్తించి ఇతర రంగాల్లోనూ రాణించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.
– సౌమ్య, మున్నూర్ మహిళా సంఘం సభ్యురాలు

రా మెటీరియల్‌ను ప్రభుత్వమే అందించాలి



యూనిఫాం కుట్టేందుకు అవకాశం కల్పించడంతో తమకు ఉపాధి లభించింది. యూనిఫాం తయారీకి అవసరమైన బట్టతో పాటు దారం, గుండీలు తదితర రా మెటీరియల్‌ను ప్రభుత్వమే అందిస్తే బాగుంటుంది. ఉపాధితో పాటు గిట్టుబాటు ధరను అందించి ప్రోత్సహించాలి. టెండర్‌ల ద్వారా ఇతరులకు ఇవ్వకుండా మహిళా సంఘాలకు యూనిఫాం తయారీ అవకాశం కల్పించడం సంతోషంగా ఉంది.
–నాగరాణి, మున్నూర్ మహిళా సంఘం సభ్యురాలు, దామరగిద్ద

యాభై శాతం యూనిఫాంలు సిద్ధం



మండలంలో 45 పాఠశాలల్లో చదువుకుంటున్న 5451 మంది విద్యార్థులకు మొదటి దఫా కింద అందించనున్న వాటిలో ఇప్పటికే యాభై శాతం యూనిఫాంలు సిద్ధమయ్యాయి. మరో రెండు రోజుల్లో వంద శాతం పూర్తి చేసి సకాలంలో పాఠశాలల వారీగా అందజేస్తాం
–నర్సింములు, ఏపీఎం, దామరగిద్ద

శిథిలావస్థలో గ్రంథాలయాలు



మరికల్‌లో గ్రంథాలయం దుస్థితి

మరికల్: మండలంలోని గ్రంథాలయాల్లో నిర్వహణ గాడీ తప్పింది. విజ్ఞానకాంతులు పూయించడానికి ఏర్పాటు చేసిన గ్రంథాలయాలు శిథిలావస్థకు చేరడంతో విద్యార్థులు, పుస్తక ప్రేమికులకు ఇబ్బందులు తప్పడం లేదు. పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలు అందుబాటులో ఉంచకపోవడం అలాగే అటెండర్లే పెద్ద దిక్కుగా గ్రంథాలయాలను నడిపిస్తుండడంతో అభ్యర్థులు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. కొన్ని అద్దె భవనాల్లో మరికొన్ని పురాతన భవనాల్లో నిర్వహిస్తున్నారు. దీంతో విజ్ఞాన కేంద్రాలకు వెళ్లేందుకు పాఠకులు ఆసక్తి చూపడం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి గ్రంథాలయలకు నిధులు మంజూరు చేసి పూర్వ వైభవం తీసుకురావాలని పాఠకులు కోరుతున్నారు.

మహాసభ విజయవంతం చేయండి



కరపత్రాలు విడుదల చేస్తున్న చాకలి సంఘం నాయకులు

ధన్వాడ: చాకలి ఎస్సీ సాధన సమితి 8వ వార్షికోత్సవ మహాసభను విజయవంతం చేయాలని చాకలి సంఘం జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్ అన్నారు. ఈ మేరకు గురువారం ధన్వాడ మండల కేంద్రంలోని చాకలి సంఘం కమ్యూనిటీ హాల్‌లో మహాసభ కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశంలోని మూడు రాష్ట్రాలలో చాకలి కులస్థులకు ఎస్సీ రిజర్వేషన్ కలిప్పించగా ఇక్కడ మాత్రం బీసీ–ఏలో చేర్చారన్నారు. దీని వల్ల చాకలి కులస్థులు రిజర్వేషన్ కోల్పోయి ఉద్యోగాలు సాధించలేకపోతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి తెలంగాణలో కూడ చాకలి కులస్థులను ఎస్సీలో చేర్చాలని కోరారు. కార్యక్రమంలో బాలయ్య, పటేల్ నర్సింములు, కొండప్ప, వరాహస్వామి, వెంకట్రాములు పాల్గొన్నారు.

వైభవంగా హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠాపన



ప్రతిష్ఠాపన చేసిన ఆంజనేయ స్వామి విగ్రహం

నారాయణపేట రూరల్: జిల్లా కేంద్రంలోని శ్రీలక్ష్మి గణపతి దేవాలయంలో హనుమాన్ జయంతి సందర్భంగా ఆంజనేయ స్వామి వారి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవ వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా గురువారం అర్చకులు విద్యాధర్ దీక్షిత్ ఆధ్వర్యంలో గణపతి పూజ, జలాదివాసం, దాన్యాదివాసం, శయాదివాసం యంత్ర ప్రతిష్ఠ, విగ్రహ ప్రతిష్ఠాపన, ప్రాణప్రతిష్ఠ, హనుమత్ హోమం, పూర్ణాహుతి తదితర పూజా కార్యక్రమాలతో పాటు నైవేద్యం సమర్పించి మహా మంగళహారతి చేపట్టారు. అనంతరం భక్తులకు సర్వదర్శనం కల్పించి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జ్ఞానేశ్వర్ గౌడ్, గౌరిశంకర్, అనిల్ గైక్వాడ్, విష్ణువర్ధన్ రెడ్డి, అశ్విన్ డగె, బట్టి బాలచందర్, మహిళలు భక్తులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి జయంతి ఉత్సవాలు

ఊట్కూరు: మండలంలోని బిజ్వార్‌లో శ్రీపడమటి ఆంజనేయస్వామి దేవాలయంలో గురువారం టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ఆంజనేయస్వామి జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి జలాభిషేకం, పంచామృతాభిషేకం, పుష్పలంకరణ, మహామంగళహారతి తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. హనుమాన్ చాలీసా పారాయణం చేపట్టారు. నర్సింహచారి జ్యోషి ధార్మిక ప్రవచనాలు చేపట్టారు. కార్యక్రమంలో భక్తులు ఆంజనేయులుగౌడ్, మహేష్‌గౌడ్, హనిమిరెడ్డి, భూపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

‘ఉపాధి’ కూలీల సమస్యలు పరిష్కరించాలి



సింగారంలో కూలీలతో మాట్లాడుతున్న బలరాం

నారాయణపేట రూరల్: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న కూలీల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బలరాం డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని సింగారం, చర్లపల్లి గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి కేంద్రాలకు వెళ్లి కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి ఈనెల 26న కలెక్టరేట్ ముందు ధర్నా చేపట్టనున్నట్లు తెలిపారు. రోజువారి కూలిని రూ.600 పెంచాలని, ఏడాదిలో 200 దినాలు కల్పించాలని డిమాండ్ చేశారు. పని ప్రదేశాల్లో కూలీలకు అవసరమైన సౌకర్యాలను ఏర్పాటు చేయాలని, పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని కోరారు. బడ్జెట్లో ఉపాధి హామీ కేటాయింపులు పెంచాలని, కూలీలకు ప్రమాద బీమా సౌకర్యాన్ని కల్పించాలని కోరారు. కూలీల సమస్యల సాధనకు చేపట్టిన ధర్నాకు పెద్ద ఎత్తున కూలీలు తరలి రావాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నాయకులు నరహరి, పవన్, కూలీలు పాల్గొన్నారు.

బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలి



ఊట్కూరు: ఉపాధి కూలీల బకాయి వేతనాలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వెంకటరామారెడ్డి కోరారు. మండలంలోని అమీన్‌పూర్‌లో గురువారం ఉపాధి కూలీలతో మాట్లాడుతూ ఈ నెల 26న జిల్లా కేంద్రం నారాయణపేటలో ఉపాధి కూలీల సమస్యలపై ధర్నా చేపట్టనున్నట్లు తెలిపారు. ధర్నాలో కూలీలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఉపాధి కూలీలకు ఏడాదిలో 200 రోజులు పని కల్పించాలని, రోజు కూలి రూ.600 చెల్లించాలని, పనులు జరిగే ప్రదేశంలో కనీస మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

ప్రతిభ చాటేందుకు సాధన తప్పనిసరి



క్రీడాకారులకు పండ్లు పంపిణీ చేస్తున్న హారిక దేవి

దామరగిద్ద: క్రీడల్లో ప్రతిభ చాటుకునేందుకు ప్రత్యేక సాధన చేయాలని ఖేలో ఇండియా అథ్లెటిక్స్ కోచ్ హారిక దేవి అన్నారు. గురువారం మండలంలోని బాపన్‌పల్లిలో జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అథ్లెటిక్స్ సమ్మర్ క్యాంప్‌ను ఆమె సందర్శించి క్రీడాకారులతో మాట్లాడారు. క్రీడల్లో జిల్లా, రాష్ట్ర, జాతీయ అంతర్జాతీయ స్థాయిలో రాణించే అవకాశం ఉంటుందన్నారు. అనంతరం వారికి పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రమణ, డైరెక్టర్ శ్రీకాంత్, కోచ్ మహేష్ క్రీడాకారులు పాల్గొన్నారు.

పల్లెగడ్డలో భక్తిశ్రద్ధలతో నగర సంకీర్తన



మరికల్: మండలంలోని పల్లెగడ్డలో టీటీడీ, హిందు ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో గురువారం ‘మనగుడి’ కార్యక్రమం నిర్వహించారు. హనుమాన్ జయంతిని పురస్కరించుకొని ‘మనగుడి’తో పాటు నగర సంకీర్తన వైభవంగా జరిపించారు. అనంతరం స్వామి వారికి పంచామృత అభిషేకం, తమలపాకుల పూజ కార్యక్రమాలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో టీటీడీ ధర్మకర్త శ్రీరాములు, భక్తులు పాల్గొన్నారు.

ప్రతిష్ఠాపనోత్సవానికి ముమ్మరంగా ఏర్పాట్లు



ఎమ్మెల్యేకు ఆహ్వాన పత్రిక అందిస్తున్న నిర్వాహకులు

ఆత్మకూర్: పట్టణంలో నూతనంగా నిర్మిస్తున్న పోశమ్మ, కట్టెమ్మ, లింగమయ్య, కోటమైసమ్మ, కట్ట మైసమ్మ, భూలక్ష్మమ్మ, బొడ్రాళ్ల ప్రతిష్ఠామహోత్సవానికి నిర్వాహకులు ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈమేరకు గురువారం మక్తల్ ఎమ్మెల్యే డాక్టర్ వాకిటి శ్రీహరి, మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డికి నిర్వాహకులు ఆహ్వాన పత్రికలు అందజేశారు. జూన్ 3 నుంచి 5 వరకు నూతన ఆలయాలు, గ్రామదేవతల విగ్రహాల ప్రతిష్ఠాపనలు ప్రముఖ వేదపండితుల మంత్రోచ్చరణలతో జరుగునున్నాయని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు. కార్యక్రమంలో అధ్యక్షులు డాక్టర్ మొగిలి శ్రీధర్‌గౌడ్, నాయకులు రహ్మతుల్లా, పరమేష్, తులసీరాజ్, శ్రీను, నిర్వాహకులు మణివర్ధన్‌రెడ్డి, ఎస్టీడీ శ్రీను, శివానంద్, రమాకాంత్, నాగేష్, వెంకటేష్, యాదగిరిశెట్టి, బాలకృష్ణ, రఘు, సూరి, ఆనంద్, అశోక్, కృష్ణయ్య, రవీందర్, రాము, సాయిరాఘవ తదితరులు పాల్గొన్నారు.

రైతుల పేరిట బినామీ రుణాలు



తనకు న్యాయం చేయాలని పత్రాలను చూపిస్తున్న బాధిత రైతు సాయిబన్న

ఊట్కూర్: రైతుల పేరిట బినామీ రుణాలు తీసుకొని కాజేసిన ఘటన ఉట్కూరులో వెలుగుచూసింది. వివరాల్లోకి వెళ్తే.. కృష్ణ మండలం తంగడి గ్రామానికి చెందిన కురువ ఆశప్ప అనే రైతు పదేళ్ల క్రితం మాగనూరులోని గ్రామీణ బ్యాంకులో వ్యవసాయ రుణం తీసుకొని తర్వాత దానిని చెల్లించాడు. అయితే ఈ ఏడాది తన భూమిపై యూనియన్ బ్యాంకులో వ్యవసాయ రుణం కోసం దరఖాస్తు చేసుకున్నాడు. బ్యాంకు అధికారులు నో డ్యూ సర్టిఫికెట్ తీసుకురావాలని సంబంధిత బ్యాంకుల ఫారంలు ఇచ్చారు. ఈ క్రమంలో మక్తల్ పట్టణంలోని ఎస్‌బీఐ బ్యాంకులో నోడ్యూ సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేసుకోగా అక్కడ బ్యాంకు అధికారులు కురువ ఆశప్పతో పాటు ఆయన కుమారుడు కురువ సాయిబన్న పేరుపై ఊట్కూర్ ఎస్‌బీఐ బ్యాంకులో రూ.3 లక్షల అప్పు ఉన్నట్లు తెలిపారు. కురువ ఆశప్ప పేరుపై రూ.1.70 లక్షలు, కుమారుడు కురువ సాయిబన్న పేరుపై రూ.1.66 లక్షలు అప్పు ఉన్నట్లు చెప్పడంతో బాధిత రైతు లబోదిబోమంటూ అధికారులు ఆశ్రయించారు. తాను ఇప్పటి వరకు ఊట్కూర్ బ్యాంకుకు రాలేదని తమ పేరిట రుణాలు తీసుకోవడం ఏమిటని ఆవేదన వ్యక్తం చేశాడు. ఊట్కూర్ ఎస్‌బీఐ బ్యాంకులో మూడేళ్ల క్రితం ఊట్కూర్, మక్తల్, నారాయణపేట మండలాలకు చెందిన 200 మంది రైతుల పేరిట బ్యాంకు సిబ్బంది సుమారు రూ.5 కోట్ల వరకు బినామీ రుణాలు తీసుకున్నారని బాధిత రైతులు ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేశారు.

ఖరీఫ్ సాగుకు రైతన్న సన్నద్ధం



భూమిని దున్నుతున్న రైతులు

కొత్తపల్లి: మండలంలో తొలకరి వర్షాలు కురవడంతో గ్రామీణ ప్రాంత రైతన్నలు విత్తనాలు విత్తుకొనుటకు సమాయత్తం అవుతున్నారు. బుధవారం కురిసిన భారీ వర్షానికి మండల పరిధిలోని భూనీడు శివారులో రైతులు పెసళ్ల సాగు చేపట్టారు. గత ప్రభుత్వం (జీనుగ)పచ్చిరొట్ట విత్తనాలు 60 శాతం సబ్సిడీతో అందించారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం 50 శాతం సబ్సిడీతో అందిస్తుండడంతో అధిక ధరలను భరించలేక పెసళ్లను సాగు చేస్తున్నట్లు తెలిపారు. అలాగే పెసళ్ల పంట 60 రోజుల్లోనే కాపునకు వస్తుండడంతో సాగు చేస్తున్నట్లు వెల్లడించారు.

జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలి

మరికల్: మండలం కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు వేణు, రమేష్‌లు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. కొత్తగా ఏర్పడిన అన్ని మండల కేంద్రాల్లో జూనియర్ కళాశాల ఏర్పాటు చేశారన్నారు. కాని మరికల్‌లో మాత్రం ఏర్పాటు చేయకపోవడంతో పదో తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు ఉన్నత విద్య కోసం ఇతర పట్టణాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. గత 15 ఏళ్ల నుంచి ప్రభుత్వ జూనియర్ కళాశాల కోసం ఇక్కడి యువత ఆందోళన చేస్తున్నా ఫలితం మాత్రం దక్కడం లేదని విమర్శించారు. ఉన్నత విద్యకు దూరమవుతున్న పేద విద్యార్థులను దృష్టిలో ఉంచుకొని ఎమ్మెల్యే వెంటనే మరికల్‌కు జూనియర్ కళాశాల మంజూరుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీ



ఎరువుల దుకాణంలో రికార్డులను తనిఖీ చేస్తున్న రాజేందర్ అగర్వాల్

దేవరకద్ర: మండల కేంద్రంలోని ఎరువుల దుకాణాలను గురువారం మండల వ్యవసాయ అధికారి రాజేందర్ అగర్వాల్ తనిఖీ చేశారు. రైతులకు నాణ్యత గల విత్తనాలు విక్రయించాలని సూచించారు. రైతులు కొనుగోలు చేసే ఎరువులు, విత్తనాలకు సంబంధించి బిల్లు రశీదులు ఇవ్వాలన్నారు. ఎమ్ఆర్‌పీ ధరలకే విక్రయించాలని, ఎక్కువ ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి షాపు ముందు స్టాక్ బోర్డు పెట్టాలని, రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలని కోరారు. కాలంతీరిన పురుగు మందులు, విత్తనాలు విక్రయించరాదన్నారు. వ్యవసాయ అధికారులు మండల కేంద్రంలోని నాలుగు ఎరువుల దుకాణాలు తనిఖీ చేశారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



గార్లపహాడ్‌లో పూర్వపు విద్యార్థుల సమ్మేళనం

కోయిల్‌కొండ: మండలంలోని గార్లపహాడ్ ఉన్నతపాఠశాల 2001–2002 బ్యాచ్ విద్యార్థులు గురువారం ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు ఏర్పాటు చేసిన సరస్వతీదేవి విగ్రహాన్ని ఉపాధ్యాయులతో ఆవిష్కరించారు. అనంతరం ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు.

సొంత నిధులతో తాగునీటి పైప్‌లైన్ ఏర్పాటు

ఆత్మకూర్: పట్టణంలోని బీసీకాలనీలో తాగునీటి ఎద్దడి నెలకొనడంతో మాజీ వార్డుసభ్యుడు గడ్డమీది శ్రీనివాసులు రూ.27 వేలు వెచ్చించి తాగునీటి పైప్‌లైన్‌ను గురువారం ఏర్పాటు చేయించారు. పాలకమండలి పదవీకాలం ముగియడంతో తాగునీటి ఇబ్బందులు తీర్చలేని పరిస్థితి నెలకొనడంతో కాలనీవాసుల బాధను గుర్తించి తన సొంత నిధులు సమకూర్చి పైప్‌లైన్‌ను ఏర్పాటు చేయించినట్లు శ్రీనివాస్ తెలిపారు. కాలనీవాసులు శ్రీనివాసులును అభినందించారు.



టీటీడీ కల్యాణ మండపంలో విశేష పూజలు

స్టేషన్ మహబూబ్‌నగర్: తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని టీటీడీ కల్యాణ మండపంలో హనుమన్ జయంతి సందర్భంగా గురువారం ఆంజనేయస్వామికి విశేష పూజలు నిర్వహించారు. హనుమాన్ చాలీసా భజన బృందం, శ్రీసీతారామ భజన మండలి, స్థానిక భజన మండలితో హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. అనంతరం టీటీడీ సంయోజకులు డాక్టర్ ఉత్తరపల్లి రామాచారి హనుమంతుని జననంపై ధార్మిక ప్రవచనం చేశారు. కనిపెట్ట భజన మండలి అధ్యక్షులు రంగారెడ్డి, సంజీవాచారి, శ్రీవారి సేవకులు ఎ.కేశవులు, సురేష్‌చంద్ర దూత్, హనుమంతురెడ్డి, పాండురంగం, శ్రీవెంకటేశ్వర మహిళా సత్సంగ మండలి సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.